RNI NO:Title-Code:-TELTEL02102
# జర్నలిస్ట్ వార్త
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక


4లో.

ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు : సీఎం రేవంత్

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 242 శనివారం14 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# హద్దు మీరితే కఠిన చర్యలే

- ట్రై సిటీస్ సీపీలతో డీజీపీ జితేందర్ భేటీ
- కఠినంగానే వ్యవహరించాలని ఆదేశాలు
- శాంతి భద్రతలకు విఘాతం రానివ్వొద్దు
- ఎవరైనా యత్నిస్తే చూస్తూ ఊరుకోం
- తెలంగాణ ప్రతిష్ట, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలి
- పోలీసు కమిషనర్లకు సూచించిన డీజీపీ

డిజిపి జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే ఏమాత్రం సహించబోమని డీజీపీ జితేందర్ హెచ్చరించారు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించొద్దని హెచ్చరించారు. కాగా, లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సిటీ పోలీస్ కమిషనర్ లకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మిగతాది 2లో...



శాంతిభద్రతలపై రాజీ ప్రసక్తి లేదు
ప్రభుత్వాన్ని అస్థిర పరచే కుట్రలో బిఆర్ఎస్
శాంతిభద్రతలపై కఠినంగా ఉండాల్సిదే
డిజిపికి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

# నష్టపోయాం ఆదుకోండి


వరద నష్టం అంచనాపై కేంద్ర బృందంతో రేవంత్ రెడ్డి భేటీ
వరదల నివారణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో వరద నష్టం అంచనాపై సచివాలయంలో కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రనష్టం సంభవించింది. ఈ క్రమంలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రబృందం ఏపీ, తెలంగాణలలో పర్యటించింది. కేంద్రబృందం సభ్యులు సచివాలయంలో తెలంగాణ సీఎంతో భేటీ అయ్యారు.తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదల నివారణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు.తెలంగాణలో వరద వల్ల జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బృందం దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనలు లేకుండా తక్షణ సాయానికి నిధులు అందించాలని కోరారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందన్నారు.

# జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్


2లో.



# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల హౌజ్ అరెస్టులు

ప్రజాపాలనలో ప్రతిపక్షాలపై దాడులు దారుణం
ఎమర్జెన్సీ రోజులను అమలవుతున్నాయన్న కెటిఆర్





హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న బీఆర్ఎస్ నేతలను అర్ధరాత్రి వరకు అక్రమ అరెస్టులు చేసి.. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా హౌస్ అరెస్టులు చేస్తారా? అంటూ ఆయన ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవడానికి కూడా అనుమతి లేదా? అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు.


మిగతాది 2లో...

## తెలుగు ప్రజలకు ప్రధాని చవితి కానుక

# 16న రెండు కొత్త వందే భారత్ రైళ్లు


2లో.

# వడ్డీ రేట్ల తగ్గింపుపై తొందరపడటం లేదు



వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ కీలక వ్యాఖ్యలు
ద్రవ్యోల్బణం తగ్గుతుండడంతో వడ్డీ రేట్లు తగ్గిస్తుందనే అంచనాలు
వడ్డీ రేట్ల తగ్గింపుపై తాము తొందరపడటం లేదన్న శక్తికాంతదాస్
ఇతర కేంద్ర బ్యాంకులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచన

# నోటీసులు ఇవ్వకుండానే చర్యలా ?

## 'హైడ్రా' తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి !

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):

చెరువులు, జలాశయాలను కబ్జాల నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా చట్టబద్ధతను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైడ్రాకు ఉన్న అధికారాలను సవాలు చేస్తూ లక్ష్మి అనే మహిళ పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అమీన్‌పూర్‌లో ఈ నెల 3న షెడ్లు కూల్చివేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నా కూల్చి వేశారని తెలిపారు. ఈక్రమంలో స్పష్టమైన ఉత్తర్వులు చూపించినా.. న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా.. అవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా దూకుడు ప్రదర్శిస్తూ,



కూల్చివేతలకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారా? అంటూ హైడ్రాను ప్రశ్నించింది. జీవో 99పై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# హద్దు మీరితే కఠిన చర్యలే

**(మొదటి పేజి తరువాయి)**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ఎలాంటి ఆందోళనలకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ముఖ్యంగా విద్వేషాలను రెచ్చగొట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ తెలిపారు. చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలని పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసులకు సహకరించాలని, తెలంగాణ పోలీసుల ప్రతిష్టను, హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడాలని డీజీపీ కోరారు. ఎట్టి పరిస్థితుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . రాజకీయ కుట్రలను ఏమాత్రం సహించేది లేదని అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే పనిలో బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. ముఖ్యంగా రెచ్చగొట్టి గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తుండడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 రోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై స్పందించారు. అధికారం కోల్పోయామనే

అక్కసుతో కొందరు కొందరు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఇబ్బంది కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించారు. రాజకీయ కుట్రలు సహించేది లేదని.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసే పనిలో బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్లలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని.. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించొద్దని డీజీపీ పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని.. రాష్ట్ర ప్రతిష్టను ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడాలని అన్నారు.

కాగా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తలెత్తిన వివాదం క్రమంలో గురువారం నుంచి నగరంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. గురువారం పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు దాడికి పాల్పడగా.. బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చిన క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సహా ఇతర నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కోకాపేటలోని హరీష్ నివాసం వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలను సైతం ఎవరినీ కలవనీయడం లేదు. హరీష్ రావును కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను సైతం అడ్డుకున్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం మొదలైనప్పటి నుంచి పడగొడతామని బీఆర్ఎస్, బీజేపీలు పదేపదే చెప్పాయి. అయితే, కేసీఆర్ లక్కీ నెంబర్ మా దగ్గర ఉన్నందున ప్రభుత్వానికేమీ ఢోకా లేదు. ఉప ఎన్నికలొస్తాయని బీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడేందుకు యత్నిస్తోంది. కేసీఆర్ కోసం కొత్త రాజ్యాంగమేమీ ఉండదు. ప్రభుత్వం చేసే మంచి పనుల గురించి మాట్లాడకుండా తొలిరోజు నుంచే ప్రభుత్వం కూలిపోతుందని మాట్లాడుతున్నారు. మేం నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం.' అని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీకి సూచించారు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు పోలీసులు షాక్ ఇచ్చారు. పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ రవి చందన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

# 17న నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

**-ముగింపు దశకు చేరుకున్న గణెష్ ఉత్సవాలు -25వేలమంది పోలీసులతో నిమజ్జన బందోబస్తు**

**-1.30 గంటలకల్లా ఖైరతాబాద్ గణెశుడి నిమజ్జనం -అధికారులతో సమీక్షించిన సిపి సివి ఆనంద్**

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): నగరంలో గణెశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు. 17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్‌సాగర్ పరిసరాలకు వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు. ఇకపోతే గణెలిష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణెలిష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణెలిష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణెలిష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణెలిష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ



సీవీ ఆనంద్ వెల్లడించారు. గణెలిష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణెలిష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఇకపోతే ఒక గణెలిష్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుంది. విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను అమర్చకూడదు. నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌కు అనుమతి లేదు. రంగులు చల్లుకునేందుకు కాన్ఫెట్టి తుపాకులను ఉపయోగించకూడదు. విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులకు అనుమతి ఉండదు.

రోడ్డుపై వాహనం వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదు విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇతర వాహనాలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా మార్గంలో ఆపకూడదు. అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు


వాహనాల కదలికలు ఆధారపడి ఉంటాయి. ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, కాల్పులు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు. జెండాలు లేదా అలంకారాల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు. వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్‌లను బాటసారులపై వేయకూడదు. ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించకూడదు. జనాలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.

ఊరేగింపు సమయంలో బాణాసంచా ఉపయోగించకూడదు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# వడ్డీ రేట్ల తగ్గింపుపై తొందరపడటం లేదు

### వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీ రేట్లను తగ్గిస్తుందా? అంటే, అందుకు తొందరపడం లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ వెల్లడించారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండటంతో యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కూడా వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాల ఉన్నాయి. దీంతో భారత్ కూడా వడ్డీ రేట్లను తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో... సింగపూర్‌లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఫైనాన్స్ ఫోరమ్ 2024'లో పాల్గొన్న శక్తికాంతదాస్ మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్పటికీ వడ్డీ రేట్లను తగ్గించేందుకు తాము తొందరపడటం లేదన్నారు. ద్రవ్యోల్బణం 2-6 శాతం మధ్య ఉంచాలన్న తమ లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. అయితే తమ లక్ష్యం 4 శాతంగా ఉందన్నారు. పరపతి విధాన సమీక్ష నిర్ణయాలలోనూ దీనిపై చర్చించామన్నారు. ద్రవ్యోల్బణం అంశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశీయ వృద్ధిలో ప్రైవేటు వినియోగం, పెట్టుబడులది కీలకపాత్ర అన్నారు. కరోనా తర్వాత భారత ఆర్థిక



వ్యవస్థ తీవ్ర సంక్షోభం నుంచి బయటపడి వేగంగా పుంజుకుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం జీడీపీ వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ రుణాలు పెరగడంపై శక్తికాంతదాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

# 16న రెండు కొత్త వందే భారత్ రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ - హైదరాబాద్, దుర్గ్ - విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని కేంద్రమంత్రి తెలిపారు. 70ఏళ్లు దాటిన వారందరికీ రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనుంది. 70 ఏళ్లు దాటిన వయో వృద్ధులందరికీ.. ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5లక్షల టాప్-అప్ కవర్ ఇవ్వనుంది. కేంద్రం నిర్ణయంతో.. వయోవృద్ధుల్లో హర్షం నెలకొంది. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.

# జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల..

ఢిల్లీ సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ లభించిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ భూన్యా ఇద్దరూ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేశారు. సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ఈ బెయిల్ మంజూరు చేసింది. దీనికి ముందు, ఈడీకి సంబంధించిన కేసులో కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుండి బెయిల్ కూడా పొందారు. తాజాగా..



శుక్రవారం సాయంత్రం కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల అయ్యారు. ఆయనకు స్వాగతం పలికేందుకు ఆప్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. అంతేకాదు.. కేజ్రీవాల్‌కు జైలు ఎదుట పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్వాగతం పలికారు. అయితే ఈ ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టు కాగా, జూన్ 26న తిహార్ జైలు నుంచి సీబీఐ అరెస్ట్ చేసింది. దాదాపు ఐదున్నర నెలల పాటు కేజ్రీవాల్ తిహార్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

## రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల

# హౌజ్ అరెస్టులు

**(మొదటి పేజి తరువాయి)**

బీఆర్ఎస్ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రికి వెన్నులో వణుకెందుకని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల్ని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం దిగజారుడు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించమన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రశ్నిస్తే చాలు ప్రజాప్రతినిధులపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్ ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ సహించదని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని.. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెబుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతల్ని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# పోర్ట్ బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

**పేరు మారుస్తూ కేంద్రం నిర్ణయం**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా**

న్యూఢిలీ సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఇకపై దానిని శ్రీ విజయపురంగా వ్యవహరించాలని నిర్ణయించింది. వలసవాద ఆనవాళ్ల నుంచి బయటపడేందుకు ఈ పేరును మార్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.




వలసవాద గుర్తుల నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయపురంగా మార్చాలని నిర్ణయించాం. మునుపటి పేరు వలసవాద వారసత్వాన్ని సూచిస్తోంది. శ్రీ విజయపురం అనేది భారత స్వాతంత్ర్య పోరాటంలో సాధించిన విజయానికి ప్రతీక. నాటి పోరాటంలో అండమాన్ నికోబార్ పాత్ర ఎంతో ప్రత్యేకంఅని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. చరిత్రతో పాటు స్వాతంత్ర్య పోరాటంలోనూ అండమాన్ నికోబార్ దీవులది కీలక పాత్ర అని అమిత్ షా పేర్కొన్నారు. చోళ సామ్రాజ్యంలో నౌకదళ స్థావరంగా ఉన్న ఈ భూభాగం.. ప్రస్తుతం మన దేశ వ్యూహాత్మక, అభివృద్ధి ఆశయాలకు కీలక కేంద్రంగా పని చేస్తోందన్నారు. మన జాతీయ పతాకాన్ని మొట్టమొదటిసారిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇక్కడే ఎగరవేశారని గుర్తుచేశారు. వీర్ సావర్కర్‌తో పాటు అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులను బంధించిన సెల్యూలర్ జైలు కూడా ఇక్కడే ఉందన్నారు.

# ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు : సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్ మహానగరంలో పెరిగిపోయిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాన్స్‌జెండర్‌లను వాలంటీర్లుగా నియమించాలని ఆయన అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగర పోలీసులోని ట్రాఫిక్ పోలీస్ విభాగంతో పాటు హోంగార్డులు ప్రస్తుతం నగరంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. హోంగార్డ్స్ తరహాలోనే ట్రాన్స్‌జెండర్లకు ఈ విధులు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి నెలా వారికి కొంత స్టైఫండ్ ఇవ్వాలని, దీంతో వారికి కొంతమేరకు ఉపాధి కల్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. అందుకు ఆసక్తిగా ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. వారం, పది రోజుల పాటు వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా అందించాలని చెప్పారు. విధుల్లో ఉండే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా ఉండాలని అధికారులకు సీఎం సూచించారు.

# నర్సంపేట జిల్లా ఆసుపత్రి ముగింపు

## - వర్ధన్నపేట ఆసుపత్రికి డాక్టర్ల తరలింపు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పరిధిలో జిల్లా ఆసుపత్రిగా పేరొందిన నర్సంపేట సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలు ముగిశాయి. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నర్సంపేట జిల్లా ఆస్పత్రి నుంచి బదిలీపై 9 మంది డాక్టర్లు వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని చేరుకున్నారు. నర్సంపేట పట్టణ కేంద్రంలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా భారీ స్థాయిలో మెడికల్ కళాశాల ఏర్పాట్లను పూర్తి చేశారు. అక్కడ విధులు నిర్వర్తించిన డాక్టర్లు ప్రస్తుతం వరంగల్ జిల్లాలో మరో ఆసుపత్రి లేకపోవడం కారణంగా వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేస్తూ, కలెక్టర్ నియామాక పత్రాలను జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ కాపీ డిసిహెచ్ఎస్ రామ్మూర్తికి అందజేసి, ఆయన ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఆసుపత్రిలో చార్జ్ తీసుకున్నారు. ఇదే వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి నర్సంపేట డిసిహెచ్ఎస్ పరిధిలో ఉండేది. ఇటీవల వర్ధన్నపేట సూపరింటెండెంట్ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రామ్మూర్తి ఖమ్మం జిల్లా నుండి వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వచ్చారు. గతంలో డిసిహెచ్ఎస్ అధికారిగా పనిచేసిన డాక్టర్ గోపాల్ పదవి విరమణ పొందడంతో వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి డిసిహెచ్ఎస్ అధికారిగా నియమితులైనారు. ఇంతకుముందే వర్ధన్నపేట ఆసుపత్రిలో 23 మంది డాక్టర్లు ఉండగా, దాదాపు 200 నుంచి 250 ప్రసవాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం వర్ధన్నపేటలో 27 మంది డాక్టర్లకు తోడుగా మరో 9 మంది డాక్టర్లు తోడయ్యారు. వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాల వారిగా అనేకమంది గర్భిణీ స్త్రీలు ప్రసవాల కోసమని, వివిధ వ్యాధులకు వైద్య కోసమని వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. కొంతమంది ఆరోగ్య స్థితి సరిగా ఉండటం లేదని, అన్ని మౌలిక వసతులు వరంగల్ ఎంజీఎం, సికెఎం ఆస్పత్రి వద్ద అందుబాటులో ఉంటాయని, చెబుతూ గర్భిణీలను, వ్యాధిగ్రహిస్తులను ఎంజీఎం, సికెఏం ఆసుపత్రులకు రిఫర్ చేస్తుంటారు. ప్రస్తుతం డాక్టర్ల సంఖ్య అధిగమైనప్పుడు వైద్య సేవలు



అందించడంలో ఆసక్తి చూపించే అవకాశం ఉండబోతుందా..? వేచి చూడాల్సిందే మరి..

### ప్రభుత్వాలు మారినా, డాక్టర్లు మారిన మౌలిక వసతుల కొరత మారడంలేదు..?

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన ఎప్పుడూ మార్పు చెందిన సందర్భాలు లేకపోయాయి.

గతంలో కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత బిఆర్ఎస్ పార్టీ, మళ్లీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా కొనసాగుతుంటారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. బదిలీల పేరుతో డాక్టర్లు మారుతున్నారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో పేషెంట్ తాలూకు బంధువులు మౌళిక వసతుల్లేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వర్షం పడితే తడవాల్సిందే, ఎండలకు ఆయాస పడాల్సిందే అన్న చందంగా పరిస్థితులు తయారయ్యాయి.

### సేద తీరడానికి వసతి కల్పించాలి..

సుదూర ప్రాంతాల నుండి వైద్య సేవల కోసం వర్ధన్నపేట ఆసుపత్రిని ఆశ్రయించే వారికి సేద తీరే విధంగా ఒక షెడ్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని, బాధితులు అభిప్రాయ



పడుతున్నారు. వర్షం పడినా, ఎండ కొట్టినా సేద తీరడానికి వీలుగా ఉంటుందని పేషెంట్ తరపు బంధువులు కోరుతున్నారు. పేషెంట్లను అడ్మిట్ చేసి, పేషెంట్లకు చేదోడుగా ఉండేవారు భోజనం చేయాలంటే, హాస్పిటల్ ఆవరణంలో ఉన్న చెట్ల కింద భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు.

### కనీసం త్రాగునీటి సౌకర్యమైన ఏర్పాటు చేయాలి

ఆస్పత్రికి దాదాపుగా ఒక రోజుకి వందలాదిమంది వైద్య సేవల కోసం వస్తున్నారని ఆసుపత్రి ఓపి ఆధారంగా వైద్యులు చెబుతున్నారు. అలా వస్తున్న బాధితులకు కనీసం దప్పిక తీర్చుకునే విధంగా మంచినీటి సదుపాయం అందుబాటులోకి తీసుకురాకపోవడంతో బాధితుల తరపు బంధువులు చుట్టు ప్రక్కల ఏర్పడిన కిరణం షాపుల్లో మంచినీటి బాటిల్లను కొనుగోలు చేసి, దప్పిక తీర్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులపై డిసిహెచ్ఎస్ అధికారి దృష్టి సారించి, కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# అక్షయ ధరణి చిట్ ఫండ్ డైరెక్టర్ రంజన్ రెడ్డి అరెస్ట్

## - అదుపులోకి తీసుకున్న సుబేదారి పోలీసుల

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా పరిధిలోని అక్షయ ధరణి చిట్ ఫండ్ కంపెనీ డైరెక్టర్ రంజన్ రెడ్డిని శుక్రవారం సుబేదారి పోలీసులు అరెస్టు చేసి, అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండకు చెందిన పచ్చిక రంజన్ రెడ్డి అనే వ్యక్తి అక్షయ ధరణి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పెట్టుకున్నారు. అందులో 25 లేదా 50 మంది చొప్పున చిట్టి సభ్యులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి, వారి వద్ద నుండి ఏజెంట్ల ద్వారా చిట్టి డబ్బులు వసూలు చేస్తుంటారు. తన



కంపెనీలో చిట్టి వేయండి, ఒక సంవత్సరంలో ఇంట్రెస్ట్ తో సహా ఎక్కువ డబ్బులు ఇస్తామని మాయ మాటలు చెప్పగా, ఆ మాటలను నమ్మి 2018 సంవత్సరంలో ఆ చిట్ ఫండ్ కి బక్కి దిగంబర రావు అను వ్యక్తి 10 లక్షలు, 15 లక్షల రూపాయలు అతని భార్య బక్కి మంజుల పేరున 25 లక్షల రూపాయలు చిట్టి వేసి, నెలవారీగా డబ్బులు చెల్లించారు. దాంతో మొత్తం 50 లక్షల రూపాయలు కాగా 20 లక్షల రూపాయలు ఇచ్చి, మిగతా 30 లక్షల రూపాయలు మా చిట్ ఫండ్ నందు డిపాజిట్ చేయండి. మీకు 18 శాతం ఇంట్రెస్ట్ తో ప్రతి నెల వాయిదాల రూపంలో చెల్లిస్తానని, ఇలా లేనిపోని ఆశలు కల్పించి, అతడు చెప్పిన మాయమాటలను నమ్మి బక్కి దిగంబర రావు, అతని భార్య మంజుల పేరు మీద 30,00,000 రూపాయలను డిపాజిట్ చేశారు. ఫిర్యాదు ద్వారా తెలిపిన ప్రకారం 32,92,500 ఇవ్వాల్సి ఉందగా, సంస్థ యజమాని రంజన్ రెడ్డి కేవలం 16,70,625 రూపాయలు మాత్రమే చెల్లించారు. మిగతా 16,21,875 రూపాయలు ఇవ్వకుండా, భక్కి దిగంబర రావు, అతని భార్య మంజులను మోసం చేశారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చేసిన ఫిర్యాదు మేరకు సుబేదారి ఎస్సై శ్రీకాంత్ పచ్చిక నిరంజన్ రెడ్డి పై కేసు నమోదు చేసి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.

# గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

## - ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయాలి - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలో గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరగాలని, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖేడే లతో కలిసి వరంగల్ నగరంలోని నిమజ్జన ప్రాంతాలైన చిన్న వడ్డేపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, ఉర్సు చెరువు, కోట చెరువు, బెస్తం చెరువు ప్రాంతాల్లో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి, సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న, గణపతి నిమర్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిమర్జనం సులభంగా జరుగుటకు ఏర్పాట్లు కుమ్మరం చేశారు. నిమర్జనం



ప్రాంతాల్లో బ్యారీకేడింగ్ ను ఏర్పాటు చేయాలని, క్రేన్లు, విగ్రహాల నిమర్జనానికి సరిపోయే తెప్పలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఆయా నిమజ్జన ప్రాంతాల్లో శానిటేషన్, తగినంత హై మాస్ట్ లైటింగ్, మంచినీటి సౌకర్యం, ఏర్పాట్లు ఉండేలా చూడాలని జిడబ్ల్యు ఎంసీ అధికారులను ఆదేశించారు. జిడబ్ల్యు ఎంసీ, నీటిపారుదల, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చూడాలని అన్నారు. నిమర్జనం ప్రశాంత వాతావరణం లో జరిగే విధంగా చూడాలని, చెరువులో నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా సంసిద్ధంగా ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో నిమర్జనం ప్రాంతాలలో ఏర్పాట్లను పూర్తి చేసి, విధులను నిర్వర్తించాలన్నారు.

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా, ప్రశాంతంగా నిమర్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కావేటి కవిత, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి సలిమా, ఆర్డీఓ కృష్ణవేణి, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, జిడబ్ల్యు ఎంసీ, నీటిపారుదల, విద్యుత్తు, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలి

## - గ్రామ పంచాయితీ కార్యదర్శి సునీల్

పర్వతగిరి, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారు ముందస్తుగా గ్రామపంచాయతీ అనుమతులు తీసుకోవాలని కార్యదర్శి సునీల్ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. నిర్మాణం చేపడుతున్న వారు అట్టి ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలు, మీ సేవ కేంద్రాల్లో ఈ పంచాయతీ వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అన్నారు. గ్రామపంచాయతీ అనుమతి తరువాతే ఇల్లు నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపట్టకూడదని సూచించారు. ఒకవేళ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే వారిపై గ్రామపంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

# ఉపాధి హామీ పనులు తనిఖీ చేయనున్న బృందాలు

## - పర్వతగిరి ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్



పర్వతగిరి, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 16వ, విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీలలో తేదీ 1.4.2023 నుండి 31.3.2024 వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులన్నింటిని తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. నేటి నుండి తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ, ప్రతీ గ్రామంలో 3 నుండీ 4 రోజులు గ్రామాల్లోనే ఉంటూ పనులను పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ బృందానికి సహకరించి, అన్ని పనులను తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఎస్టిఎం సాయి జ్ఞానేందర్, ఎస్ఆర్పి చెన్నకేశవులు, ఏపీఓ సుశీల్ కుమార్, ఈసీ రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డిఆర్పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# గణపతి విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

## - భక్తులకు భోజనం వడ్డించిన ఎస్సై ప్రవీణ్ కుమార్

వర్ధన్నపేట, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండల పరిధిలో ప్రతిష్టాపన చేసిన గణపతి విగ్రహాల వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామంలోని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద ఒక్కరోజు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని వివేకానంద ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమంలో కొనసాగిస్తున్నారు. ఆటోనగర్ కమిటీ వారు ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం గణపతి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేసిన రోజు నుంచి



నవరాత్రి వరకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం వారి ప్రత్యేకతగా మారింది. ఈ కార్యక్రమాలకి వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులు హాజరై, భక్తులకు భోజనం వడ్డించి, స్వామి వారి కృపకు పాత్రులైనారు.

# గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులుగా బండా యాదగిరి ఎన్నిక



రాయపర్తి, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం గ్రామీణ వైద్యుల సంఘం మండల కమిటీని శుక్రవారం గ్రామీణ వైద్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 80 మంది గ్రామీణ వైద్యులు హాజరైనారు. అనంతరం మండల కేంద్రంలోని అంగడి మైదానంలో వారు సమావేశమైనారు. అధ్యక్షుని ఎన్నికతో పాటు సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కమిటీ సభ్యుల వివరాలు మండల అధ్యక్షులు బండ యాదగిరి మైలారం, ఉపాధ్యక్షులు దాసరి మహేందర్ , కార్యదర్శి మన్నూరు హరీష్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్ మైలారం, ఉల్లెంగల యాకయ్య, ఎనగందుల సోమేశ్వర్, కోశాధికారి ముద్రబోయిన శ్రీనువాస్, సలహాదారులు ఎనగందుల శ్యాంసుందర్, గోకా శ్రీనివాస్, కాన్నబోయిన కుమారస్వామి, మాచర్ల సుధాకర్, బొట్ల శ్రీనివాస్ పెరికేడు, కార్యవర్గ సభ్యులు గాజుల చిరంజీవి, పులి మహేందర్, దిండిగాల వెంకన్న, మాచర్ల రమేష్, తంగళ్ళపల్లి నగేష్, వైస్ ప్రెసిడెంట్ దుమ్మటి కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు నయీమ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు బండ యాదగిరి మాట్లాడుతూ హద్దు మీరిన వైద్యం చేయరాదన్నారు, పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ చట్ట పరిధి దాటి పనిచేయకూడాదన్నారు. మితిమీరిన వైద్యం చేస్తే శిక్షలకు గురికాక తప్పదని హెచ్చరించారు.



# గత ప్రభుత్వం వరంగల్ జిల్లాను 6 ముక్కలు చేసింది

- కాకతీయ సామ్రాజ్య పరువు, ప్రతిష్టను నాశనం చేశారు
- జఫర్గడ్ మండలాన్ని వరంగల్ జిల్లాలో కలపాల్సిన అవసరముంది
- ప్రతి ఒక్కరు సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం
- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):** జఫర్గడ్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుని, నియోజకవర్గంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుందామని శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్గడ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మండల కేంద్రంలోని వాడవాడకు, గల్లీగల్లికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవరెన్ని అసత్యాలు, దుష్ప్రచారాలు చేసినా, వారందరికీ బుద్ధి చెప్పే విధంగా తీర్పు ఇచ్చిన అందరికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ గ్రామాన్ని, మండలాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే ప్రతీ ఒక్కరూ సహకారం అవసరమని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను అన్నింటిని ప్రాధాన్యత క్రమంలో, పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు జఫర్గడ్ గ్రామానికి బీటి రోడ్డు వేయించానని తెలిపారు. జఫర్గడ్ మండలాన్ని విద్యా కేంద్రంగా మార్చినట్లు వివరించారు. త్వరలోనే జఫర్గడ్ మండలంలో బ్యాంక్ అఫ్ బరోడా బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గొప్ప చరిత్ర కలిగిన వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని, గుట్ట పైకి సిసి రోడ్డు, మెట్లు, లైటింగ్, కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుందామని అన్నారు. అలాగే మండల కేంద్రంలోని రామాలయం, శివాలయం, హనుమాన్ గుళ్లను ఆలయ కమిటీలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుందామని తెలిపారు. మండలంలోని పెద్ద చెరువును రిజర్వాయర్ చేయాలి, కట్ట మరమ్మత్తు చేయాలని, దానికోసం ఇప్పటికే 6కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. మండల కేంద్రంలోని హన్మకొండ దర్వాజ నుండి ఓబులాపూర్ క్రాస్ వరకు 4 లైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. మండల కేంద్రంలో ఇంటర్నల్ సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 1కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో తహశీల్దార్ కార్యాలయం, బస్టాండ్ నిర్మాణం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నీటి పారుదల





శాఖ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందించాలని, నష్కల్ నుండి పాలకుర్తికి వెళ్లే కాల్వల ద్వారా ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందిస్తానని తెలిపారు. గ్రామంలో పర్యటించే క్రమంలో దాదాపు 30 వరకు సమస్యలు తన దృష్టికి వచ్చాయని అన్నారు. అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని, ఏడాదిన్నర కాలంలో జఫర్గడ్ మండలంలో మీరు గుర్తించే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. జఫర్గడ్ మండలాన్ని వరంగల్ జిల్లాలో కలపాలనే డిమాండ్ ఉందని అన్నారు. జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ విభజన ప్రక్రియ చేపడితే, జఫర్గడ్ మండలాన్ని వరంగల్ జిల్లాలో కలిపే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వరంగల్ జిల్లాను 6 ముక్కలు చేసి, కాకతీయ సామ్రాజ్య పరువును, ప్రతిష్టను నాశనం చేశారని మండిపడ్డారు. ఈ విషయంలో అప్పటి ముఖ్యమంత్రితో తీవ్రంగా విబేదించానని, అందుకే మంత్రి పదవి పోగొట్టుకున్నాని అన్నారు. జిల్లాల విభజన విషయంలో తప్పుడు నిర్ణయం జరిగిందని, దానిని సరి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తనది ఏ జిల్లానో చెప్పుకోలేని అయోమయ పరిస్థితిలో ఉన్నానని, ఖచ్చితంగా జిల్లాల పునర్ వ్యవస్తీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ద్రుష్టి సారిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల సహకారం లేకుండా తాను ఏమి చేయలేనని స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరి ప్రోత్సాహం చాలా అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నష్టపోయిన వివరాలను సమర్పించండి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలపై వివరాలను వెంటనే సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సంబంధిత శాఖల అధికారులతో భారీ వర్షాల వలన కలిగిన నష్టం అంచనాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు 3 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. వర్షాల వల్ల కలిగిన నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు జరిగిన నష్టం వివరాలు, చేయాల్సిన పనులకు ఎన్ని నిధులు అవసరమో, తగిన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని కోరారు. నష్టం జరిగిన ప్రాంతాలలో త్వరగా పనులను ప్రారంభించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా ఆర్ బి అధికారి జితేందర్ రెడ్డి, టిజి ఈడబ్లు ఐడిసి ఈఈ నరేందర్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి సారంగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు చంద్రశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం.

### - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల 107 ఇళ్ల నష్టం జరిగిన లబ్ధిదారులకు 17 లక్షల 65 వేల 500 రూపాయల నష్టపరిహారం చెల్లించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని బృందాల ద్వారా సర్వే నిర్వహించి, నష్టం వాటిల్లిన 107 ఇళ్లకు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్ల మేరకు ఒక్కొక్క గృహ యజమానికి రూ.16, 500 చొప్పున మొత్తం 17 లక్షల 65 వేల 500 రూపాయలను లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. రెండవ దఫా సర్వే ప్రకారం జిల్లాలో 20 ఇళ్లకు నష్టం జరిగిందని, నష్టం జరిగిన ఇంటి యజమాని ఒక్కొక్కరికి 16, 500 రూపాయల చొప్పున సర్వేలో మరణించినట్లు గుర్తించిన 10 పశువుల యజమానులకు 3 లక్షల 25 వేల రూపాయలను త్వరలో వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని కలెక్టర్ తెలిపారు.

## ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

### - వరంగల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 13, (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగ్యూ వ్యాధి నమోదైంది. శుక్రవారం వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ వెంకటరమణ వ్యాధిగ్రస్తుని గృహాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆరోగ్యపరమైన సూచనలు చేశారు. వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సహకారంతో చేపడుతున్న ఆంటీ లార్వెల్ ఆపరేషన్, పైరిత్రం స్ప్రే పనులను పరిశీలించారు. స్థానిక శివాలయం దగ్గర ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం కాలానుగుణంగా సంభవించే వ్యాధులు ఎక్కువగ నమోదవుతున్నాయి. వైద్య సిబ్బంది వీధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే చేపట్టి, వ్యాధిగ్రస్తుల నుండి రక్తా నమూనాలను సేకరించి, మందులు పంపిణీ చేయాలని కోరారు. ప్రజలు జ్వరం రాగానే స్థానికంగా ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించి, చికిత్స పొందాలని కోరారు.

ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి, చల్లార్చి, వడబోసిన నీటినే త్రాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోకుండా, తాజాగా చేసి, వేడిగా ఉన్న పరిశుభ్రమైన ఆహార పదార్థాలనే భుజించాలని కోరారు. వారి వెంట ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ మౌనిక, ఇన్ఛార్జ్ ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, హెచ్ఈఓ ఖాసీం, హెల్త్ సూపర్వైజర్లు ఖలీమ్, శ్రీనివాస్, సదానందం, వైద్య సిబ్బంది సాగర్, షఫీ, యశోద, రాధిక, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో కార్మికులకు ఉపాధి కల్పించాలి

### - టికేఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్




వరంగల్, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలో రోజువారి కార్మికులకు ఉపాధి దొరకడం లేదని శుక్రవారం టికేఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ పరిధిలో శంభునిపేట లేబర్ అడ్డపై ఎంతోమంది కార్మికులు, రోజువారి పని లేక ఇబ్బందిలు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బీహార్, చత్తీస్గఢ్, యూపీ నుండి వచ్చిన వలస కార్మికులు తక్కువ కూలీకి పనిచేయడం వల్ల, వరంగల్ జిల్లాలో స్థానిక కార్మికులకు పని దొరకడం కరువైందన్నారు. రోజువారి కూలిపని చేస్తేనే వందలాదిమంది కుటుంబాలకు పోషణ ఉంటుంది. ఇలా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కారణంగా రోజువారిగా పని దొరకపోవడంతో ఆ కుటుంబాలకు ఆధారం లేకుండా పోతుందని వివరించారు. అనంతరం శంభునిపేట పరిధిలో కార్మికులను కలుపుకుని ర్యాలీ ప్రదర్శించారు. ఇప్పటికైనా స్థానిక కార్మికులకు తక్షణమే ప్రభుత్వం ఉపాధి కల్పిస్తూ, వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేని క్రమంలో కార్మిక సోదరులను ఐక్యం చేసుకొని, కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు కోంఢ్ర వెంకన్న, మేకల మొగిలి, ఖిలా వరంగల్ చందర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు హెల్త్ కార్డులు అందచేస్తాం: దామోదర



సంగారెడ్డి, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సమాజ నిర్మాణం బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోలు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందోలు నియోజక వర్గం ఎడ్యుకేషనల్ హబ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ ద్వారా 6,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు విడుదల చేయాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు.

## గ్రామ పంచాయితీల వద్ద ఓటరు లిస్ట్ ప్రదర్శన



వర్ధన్నపేట, సెప్టెంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల వద్ద రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వార్డుల వారిగా ఓటరు జాబితా ప్రదర్శించారు. శుక్రవారం ఎంపిడిఓ కూచన ప్రకాష్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 40 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ జాబితా ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల వారిగా ఓటర్లంతా తమ ఓటును వార్డుల వారిగా సరి చూసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. ప్రవేశపెట్టిన జాబితా ప్రకారం ఓటర్ మహాశయులకు ఏదైనా అభ్యంతరాలు ఉంటే, 21- 9- 2024 నాటి వరకు వ్రాతపూర్వకంగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సంప్రదించి, అభ్యంతరాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నాని- పవన్ రికార్డు..

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని రీసెంట్ గా సరిపోదా శనివారం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన ఆ సినిమా.. ఆగస్టు 29వ తేదీన విడుదలైంది. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటించగా.. కోలీవుడ్ నటుడు ఎస్ జే సూర్య విలన్ గా కనిపించారు. స్టార్ ప్రొడ్యూసర్ డీవీవీ దానయ్య నిర్మాణంలో రూపొందిన ఆ సినిమా.. కంప్లీట్ యాక్షన్ ఎలిమెంట్స్ తో సందడి చేసింది. అయితే రిలీజ్ కు ముందు మేకర్స్ విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ మూవీపై మంచి బజ్ క్రియేట్ చేసింది. టీజర్, ట్రైలర్.. అంచనాలు పెంచాయి. దీంతో తొలి రోజు సాలిడ్ ఓపెనింగ్స్ సాధించింది. మధ్యలో కాస్త వర్షాలు ఇబ్బంది పెట్టినప్పటికీ.. రెండో వీకెండ్ ను కూడా బాగా క్యాష్ చేసుకుంది. నాని కెరీర్ లో హిట్ గా నిలిచిన సరిపోదా శనివారం.. తెలుగు రాష్ట్రాల్లో రీసెంట్ గా బ్రేక్ ఈవెన్ టార్గెట్ పూర్తి చేసుకుంది.ప్రస్తుతం సక్సెస్ ఫుల్ గా రన్ అవుతూ లాభాలను అందిస్తోంది. అయితే యూఎస్ మార్కెట్ లో ఎప్పుడో టార్గెట్ కొట్టేసి భారీ లాభాలు సంపాదిస్తోంది సరిపోదా శనివారం మూవీ. నార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద ఎక్కువ సార్లు మిలియన్ డాలర్ల మార్క్ క్రాస్ చేసిన మహేష్ బాబు రికార్డును రీసెంట్ గా నాని బద్దలు కొట్టారు. తాజాగా మరో అరుదైన ఘనత సాధించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రికార్డును కూడా బ్రేక్ చేశారు. ఇప్పటి వరకు నార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద సరిపోదా శనివారం మూవీ 2.45 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. అలా నార్త్ అమెరికాలో పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ లైఫ్ టైమ్ కలెక్షన్లను సరిపోదా శనివారం అధిగమించింది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మరోసారి ఓవర్సీస్ లో నాని తన సత్తా చాటుకున్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. దటీజ్ నాని అని అంటున్నారు. ఇక నాని కెరీర్ విషయానికొస్తే, గత ఏడాది దసరా, హాయ్ నాన్న సినిమాలతో హిట్స్ అందుకున్న నేచురల్ స్టార్.. ఇప్పుడు సరిపోదా శనివారంతో తన ఖాతాలో వేసుకున్నారు.

# నా జీవితంలో చాలా రిలేషన్ షిప్స్ ఉన్నాయి

## : రెజీనా

ప్రవీణ్ సత్తారు రొటీన్ లవ్ స్టోరిసినిమాతో కథానాయికగా పరిచయమైన చెన్నై భామ రెజీనా కసాండ్రా.. ఆ తర్వాత టాలీవుడ్ కోలీవుడ్ లో చాలా చిత్రాల్లో నటించింది. కానీ స్టార్ డమ్ మాత్రం అందుకోలేకపోయింది. ఒకప్పుడు తెలుగు చిత్రసీమలో చాలా యాక్టివ్‌గా ఉన్న రెజీనా ఇటీవల పూర్తిగా స్లో అయ్యింది. గత ఐదు సంవత్సరాలుగా కేవలం నాలుగు తెలుగు చిత్రాలలో మాత్రమే కనిపించింది. ఎవరు, తలైవి, సాకిని డాకిని చిత్రాలతో పాటు ఆచార్యలో ఒక ప్రత్యేక పాటలో కనిపించింది. అయితే ఇప్పుడు ఉత్సవం సినిమాతో మళ్లీ తెలుగులోకి రీ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార ఇంటర్వ్యూలలో రెజీనా తన నిజ జీవిత సంబంధాల గురించి వెల్లడించింది. కపటత్వం అంటే ఏమిటో తెలియని అమ్మాయిగా రెజీనాకు పేరుంది. తన డేటింగుల విషయంలోను దాపరికం లేకుండా దానిని ప్రూవ్ చేసింది. రెజీనాను విలేకరులు వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నించగా.. తాను సీరియల్ డేటర్ అని వ్యాఖ్యానించింది. పలువురితో డేటింగులు చేసానని అంగీకరించింది. ప్రస్తుతానికి డేటింగ్ నుండి విరామం తీసుకున్నానని చెప్పింది. ఏం చేయాలో చెప్పడానికి ఇష్టపడని హైపర్-ఇండిపెండెంట్ మహిళగా తనను తాను అభివర్ణించుకుంది. రెజీనా తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌లలో ఒకరి తల్లిదండ్రులు తన ఫిల్టర్ లెస్ మాటలకు ఆశ్చర్యపోయారని కూడా తెలిపింది. యువహీరో సందీప్ కిషన్‌తో తనకు ఉన్న స్నేహం గురించి ఈ సందర్భంగా ఓపెనైంది. మేమిద్దరం టామ్ అండ్ జెర్రీ టైప్. కేవలం మంచి స్నేహితులు మాత్రమే.. మేం ఎప్పుడూ డేటింగ్ చేయలేదు అని చెప్పింది.





# తెలుగు త్రిష వెర్సస్ తమిళ త్రిష

తెలుగు, తమిళ భాషల్లో ఒకప్పుడు నంబర్ వన్ కథానాయిక స్థానానికి గట్టి పోటీదారుగా ఉండేది త్రిష. సిమ్రన్ తర్వాత ఆ స్థాయిలో దక్షిణాదిన ఆధిపత్యం చలాయించిన హీరోయిన్ ఆమే. ఐతే కొన్నేళ్ల తర్వాత ఆమె ప్రభ తగ్గిపోయింది. కెరీర్ ముగింపు దశకు వచ్చేయడంతో పెళ్లి వైపు అడుగులు వేయాలనుకుంది. కానీ ఆ బంధం నిశ్చితార్థం వరకే పరిమితమైంది. ఆపై మళ్లీ ఆమె సినిమాల్లో బిజీ అయింది.



ఆశ్చర్యకరంగా సెకండ్ ఇన్నింగ్స్‌లో మళ్లీ ఆమె మంచి స్థాయిని అందుకుంది. తమిళం, తెలుగులో పెద్ద పెద్ద సినిమాల్లో నటిస్తూ బిజీ యాక్ట్రెస్ అయిపోయింది. గత ఏడాది విజయ్ మూవీ ‘లియో’లో ఆమెనే కథానాయికగా నటించింది. ఇప్పుడు కమల్ హాసన్ మూవీ ‘థగ్ లైఫ్’బీ అజిత్ సినిమా ‘విడా ముయర్చి’తో పాటు తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన ‘విశ్వంభర’లో త్రిష నటిస్తుండడం విశేషం. ఇంకా పెద్ద విశేషం ఏంటంటే.. సంక్రాంతికి అటు తమిళంలో, ఇటు తెలుగులో త్రిష నటించిన భారీ చిత్రాలు విడుదల కాబోతున్నాయి. చిరు సినిమా ‘విశ్వంభర’ జనవరి 10కి ఎప్పుడో ఫిక్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇక అజిత్ మూవీ ‘విడా ముయర్చి’ని ముందు దీపావళికి అనుకున్నారు కానీ.. ఇప్పుడు ఆలోచన మారింది. షూట్ ఆలస్యం అవుతుండడంతో ఆ మూవీని సంక్రాంతికి వాయిదా వేశారు. ఆ పండక్కి సినిమా రావడం ఖాయం. తమిళంలో వేరే సినిమాలు కూడా రేసులో ఉన్న అందరి దృష్టి అజిత్ మూవీ మీదే ఉండనుంది. తెలుగులో కూడా ‘విశ్వంభర’నే నంబర్ వన్ మూవీగా మారబోతోంది. ఇలాంటి రెండు భారీ చిత్రాల్లో త్రిషనే కథానాయికగా నటించడం విశేషమే. 20 ఏళ్ల కెరీర్ తర్వాత, 40 ఏళ్ల వయసులో ఇంత క్రేజీ సినిమాల్లో కథానాయికగా సంక్రాంతి లాంటి క్రేజీ సీజన్లో ప్రేక్షకులను పలకరించబోతుండడం చాలా ప్రత్యేకం.



# మళ్లీ ప్రేక్షకుల ముందుకు గుండుబాస్!

టాలీవుడ్ తరహాలోనే కోలీవుడ్ లోనూ రీ-రిలీజ్ ల ట్రెండ్ నడుస్తోన్న సంగతి తెలిసిందే. స్టార్ హీరోల ఓల్డ్ హిట్ చిత్రాల్ని రీ-రిలీజ్ చేసి కోట్ల ఆదాయం చూస్తున్నారు. అభిమానుల కోసం ప్రత్యేకంగా 4కె పార్మెట్ లో చిత్రాల్ని రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కొన్ని సినిమాలు రీ-రిలీజ్ లోనే మంచి వసూళు సాధించాయి. ఈ నేపథ్యంలో తాజాగా శివాజీది బాస్‌మరోసారి రీ-రిలీజ్ కి ముస్తాబుతుంది. కేసు నమోదు సెప్టెంబర్ 20న ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ చిత్రం పరిమిత థియేటర్లోనే విడుదల వుతుంది. టికెట్ ధర కూడా చవకగానే ఉంది. 99 రూపాయలకే టికెట్ అందిస్తున్నారు. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రం రీ-రిలీజ్ అవుతుందంటూ నాలుగు వారాలుగా ప్రచారంలో ఉంది. ఈ నేపత్యంలో సెప్టెంబర్ 20న పక్కాగా రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారుట. అయితే ఇది ప్రేక్షకుల ముందుకు రావడం మూడవసారి. 2007లో తొలిసారి ఈ చిత్రం రిలీజ్ అయింది. అప్పట్లో వరల్డ్ వైడ్ గా బ్లాక్ బస్టర్ అయింది. తెలుగులో కాస్త వీక్ గా అనిపించినా ఇండియాలో చాలా చోట్ల పెద్ద సక్సెస్ అయింది. విదేశాల్లో అయితే బంపర్ హిట్ అయింది. భారీ వసూళ్లతో రికార్డులే నమోదు చేసింది. ఆ తర్వాత రజనీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా 2017 రీ-రిలీజ్ చేసారు. అప్పటి థియేట్రికల్ టెక్నాలజీ అప్ డేషన్ బేస్ చేసుకుని రిలీజ్ చేసారు. ఇప్పుడు మాత్రం 4కె ఫార్మెట్ లో రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాకి మంచి ఆదరణ దక్కుతుందని అంచనాలున్నాయి. అసలే సూపర్ స్టార్ ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే.

# ఎట్టకేలకు ల్యాండ్ అయిన సూపర్ స్టార్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గత కొన్ని వారాలుగా అమెరికాలో ఉంటున్నాడు. కుటుంబ సభ్యులతో హాలీడేస్ ను ఎంజాయ్ చేయడంతో పాటు, తనయుడు గౌతమ్ కృష్ణ కు ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ లో అడ్మిషన్ కోసం కూడా మహేష్ బాబు ఇన్ని రోజులుగా అమెరికాలో ఉంటున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. ఎట్టకేలకు యూఎస్ నుంచి మహేష్ బాబు రావడంతో మీడియా దృష్టిని ఆకర్షించారు. ఎయిర్ పోర్ట్ లో సితారతో కలిసి మహేష్ బాబు కనిపించి అందరి దృష్టిని ఆకర్షించాడు. గతంలో ఎప్పుడూ లేనంత గడ్డంతో మహేష్ బాబు తాజా ఫోటోల్లో కనిపిస్తున్నాడు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆ మధ్య ఒక సినిమా కోసం మహేష్ బాబు కాస్త గడ్డం పెంచితేనే అంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజమౌళి సినిమా కోసం మహేష్ బాబు కొన్ని నెలలుగా గడ్డం పెంచుతున్నాడు. బాబోయ్ మహేష్ బాబు మరీ ఇంత పెద్ద గడ్డంలో చూడాలా అంటూ ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం మహేష్ బాబును ఇన్నాళ్లకు మ్యాన్లీ లుక్ లో చూపించబోతున్న రాజమౌళికి కృతజ్ఞతలు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా ఎయిర్ పోర్ట్ లో కనిపించిన మహేష్ బాబు గుబురు గడ్డంతో పాటు, పొడవైన జుట్టు తో కనిపించాడు. కొత్త లుక్ కి ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో మహేష్ బాబు ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. సితార కూడా పెద్ద పాప అయింది అంటూ ఈ ఫోటోలను చూసి కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఫిల్మ్ స్కూల్ లో మహేష్ బాబు తన కుమారుడు గౌతమ్ కృష్ణ ను జాయిన్ చేసిన నేపథ్యంలో ముందు ముందు సితార ను కూడా యాక్టింగ్ స్కూల్ కి పంపిస్తే బాగుంటుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సితార కెమెరా ముందుకు వచ్చింది. కనుక ముందు ముందు సినిమాల్లో హీరోయిన్ గా సితార నటించాలనే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరి మహేష్ అభిప్రాయం ఏంటనేది తెలియాల్సి ఉంది. మహేష్ బాబు ఈ ఏడాది ఆరంభంలో సంక్రాంతి సందర్భంగా ‘గుంటూరు కారం’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటించగా, మీనాక్షి చౌదరి కీలక పాత్రలో నటించింది. ఆ సినిమా పై ఉన్న అంచనాలను అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఇప్పుడు అందరి దృష్టి రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు చేయబోతున్న సినిమా పై ఉంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాల తర్వాత హాలీవుడ్ స్థాయిలో తన సినిమాలకు గుర్తింపు తెచ్చి పెట్టిన రాజమౌళి ఇప్పుడు హాలీవుడ్ స్థాయి సినిమాను మహేష్ బాబుతో తీయబోతున్నాడట. మరి ఆ సినిమా ఎలా ఉంటుంది? ఎప్పుడు ఉంటుంది? అనే విషయాలు తెలియాల్సి ఉంది.

